యునానీని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి

యునాని దవాఖానలో జరుగుతున్న వర్క్‌షాప్‌లో పాల్గొన్న వైద్యశాల డైరెక్టర్ యూనుస్ ఇఫ్తికార్ మున్షి

వెంగళరావునగర్, సెప్టెంబర్ 27 : యునాని వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని ఎర్రగడ్డ ప్రభుత్వ యునాని వైద్యశాల డైరెక్టర్ డాక్టర్ యూనుస్ ఇఫ్తికార్ మున్షి అన్నారు. ఎర్రగడ్డ యునాని దవాఖానలో రెండు రోజులుగా జరుగుతున్న రీసెర్చ్ మెథడాలజీ మానవ వనరుల అభివృద్ధి కోర్ రీసెర్చ్‌పై జరుగుతున్న వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆయుష్ పరిధిలోకి అన్ని వైద్య విధానాలను ప్రజలకు చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వాతావరణ మార్పుల వల్ల పెరుగుతున్న రోగాలను దృష్టిలో పెట్టుకుని ప్రొఫెసర్లు పరిశోధనలు చేయాలని సూచించారు. ఇప్పటికే భారతీయ వైద్య విధానాలను ప్రపంచ దేశాలన్నీ స్వాగతిస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన సుమారు 50 మంది ప్రతినిధులు ఈ వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఆర్ఇఎం మాజీ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ యాసీన్ అలీ ఖాన్, దవాకాన మాజీ డైరెక్టర్ ఎం. వాహిద్, న్యూఢిల్లీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్. జహీర్‌అహ్మద్ సిబ్బంది ఎం.ఏ. బారీ, రాజారాం, షఫీ తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే భారతదేశ అభివృద్ధి

అత్తాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 27: మహిళల అభ్యున్నతే భారత దేశ అభివృద్ధి అని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. అత్తాపూర్‌లోని ఎస్ వీఎం గ్రాండ్ హోటల్‌లో జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్లోబల్ లీడర్, ఇన్వెస్టర్, లీడర్ షిప్ స్కిల్స్ ట్రైనర్ ఫర్హా నాతో కలిసి కొండా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు తమదైన ముద్రను వేసుకుంటూ సమాజంలో జరుగుతున్న వాటిని ప్రశ్నించాలన్నారు. త్వరలోనే రాజేంద్రనగర్‌లో కూడా ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించి మహిళలకు శిక్షణ ఇస్తామని అన్నారు. కొండా సంగీతవిశ్వేశ్వర్‌రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, మోండ్ర సంగీత పాల్గొన్నారు.

డబుల్ ఇండ్లకు తాగునీరు కరువు

ఖైరతాబాద్‌లోని డబుల్ బెడ్రూమ్ ఇండ్ల సముదాయము

- ఖైరతాబాద్‌లో 210 గృహాలకు ఒకే బోరు
- పవర్ బోర్ హామీని విస్మరించిన ఎమ్మెల్యే దానం నాగేందర్
- అవస్థలు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 27 : ఖైరతాబాద్ డబుల్ బెడ్రూం గృహాల్లో నీటి కటకట ఏర్పడింది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో గృహ యజమానుల కష్టాలను వినే నాథుడే కరువయ్యాడు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2022లో నాలుగు బ్లాకులతో 210 ఇండ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించారు. నాలుగు బ్లాకుల్లో వెయ్యికుటుంబాలు ఉంటున్నాయి. గతంలో నీటి అవసరాల కోసం బోరుతో పాటు జలమండలి నుంచి నీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం గృహాల్లో నివాసం ఉంటున్న వారి అవసరాలు పెరగడంతో పాటు మంచి నీరు సైతం సమయపాలన లేకుండా వస్తుండడంతో నీటి కోసం తండ్లాడుతున్నారు. గత నెలలో ఉన్న ఒక్క బోరు కూడా చెడిపోయి.. అధికార ప్రజాప్రతినిధులెవరూ పట్టించుకోకపోవడంతో అసోసియేషన్ సభ్యులు రూ.70వేలు ఖర్చు పెట్టి కొత్త బోరు వేసుకున్నారు.

హామీని విస్మరించిన ఎమ్మెల్యే దానం..

తాగునీటి విషయంపై డబుల్ గృహాల యజమానులు ఎమ్మెల్యే దానం దృష్టికి తీసుకెళ్లగా పవర్ బోరు వేయిస్తానని, ప్రత్యేకమైన సంపును నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎనిమిది నెలలు గడిచినా ఇంత వరకు డబుల్ గృహాల వైపు కన్నెత్తి చూడలేదని 2బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆరోపిస్తున్నారు. గతంలో జల మండలి ద్వారా వచ్చే మంచినీరు ఉదయం 4గంటలకే వచ్చేదని, ప్రస్తుతం ఎనిమిది గంటలకు వస్తుండడంతో ప్రైవేట్ ఉద్యోగాలు, కూలీ పనులు చేసుకునే వారు పనుల కోసం వెళ్లిపోగా, నీరు కేవలం ఉన్న ఒక్క సంపులోనే పడుతున్నది, సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తాగునీరు కరువవుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించి తన హామీని నిలబెట్టుకోవాలని వారు కోరారు.

యావత్ ప్రపంచం చూపు.. భారత్‌వైపు

దేశంలోని సమూల మార్పులు రావడంతో యావత్ ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, భారతీయ అంతరిక్ష శాస్త్రవేత్త జి.సతీశ్‌రెడ్డి, ఎఫ్‌టీసీసీఐ చైర్మన్ సురేశ్ సింఘాల్ అన్నారు. శుక్రవారం రాత్రి నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఆడిటోరియంలో దత్తోపంత్ తెంగ్డి పేరిట ఎక్సలెన్స్ అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకప్పుడు రక్షణ పరికరాల దిగుమతులపై ఆధారపడిన భారత్ ఇప్పుడు విదేశాలకు మిలిటరీ హార్డ్‌వేర్‌ను ఎగుమతి చేస్తుందన్నారు. ఆశ్విని మహాజన్, సత్తు లింగమూర్తి, పాల్గొన్నారు. – హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 27

సృజనాత్మక విద్యకు ఎక్స్‌పరిమెంటల్ అవార్డు

అవార్డును అందుకుంటున్న ఎస్ఎస్ఎస్‌వీ చైర్‌పర్సన్ శిరీష, హెచ్ఎం ఉషామీనాక్షి

జూబ్లీహిల్స్, సెప్టెంబర్ 27 : యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయి సరస్వతి విద్యానికేతన్ పాఠశాలకు 'ప్రమోటింగ్ ఎక్స్‌పరిమెంటల్ ప్రోగ్రామ్స్' అవార్డు లభించింది. బెంగుళూరులో 'ఎల్డోక్ ఇండియా కె-12 ఎక్స్పో' నిర్వహించిన కార్యక్రమంలో 'ది బెస్ట్ ప్రమోటింగ్ ఎక్స్‌పరిమెంటల్ లర్నింగ్ ప్రోగ్రామ్స్' కేటగిరిలో అవార్డు దక్కింది. శుక్రవారం ఎస్ఎస్ఎస్‌వీ పాఠశాల చైర్‌పర్సన్ శిరీష భవానిశంకర్, పాఠశాల హెచ్ఎం ఉషా మీనాక్షితో కలిసి ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శిరీష శంకర్ మాట్లాడుతూ.. పాఠశాలలో సృజనాత్మక విద్యతో పాటు విద్యార్థులు త్వరగా అర్థం చేసుకునేలా వినూత్న విధానాలను విస్తృతం చేస్తున్నామన్నారు. ఈ అవార్డు తమపై మరింత బాధ్యతను పెంచిందన్నారు.

కొండా లక్ష్మణ్ జీవితం అందరికీ ఆదర్శం

నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హిమాయత్‌నగర్,సెప్టెంబర్27: స్వతంత్ర సమరయోధుడు ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ జీవితం అందరికీ ఆదర్శమని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, ఇంజినీర్స్ విభాగం కోషాధికారి చిలుకూరి చంద్రమౌళి అన్నారు. బాపూజీ 109వ జయంతి సందర్భంగా శుక్రవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో బాపూజీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి బాపూజీ చేసిన సేవలు మరువలేని వని కొనియాడారు. బాపూజీ ఆశయాలను సాధించేందుకు తమ వంతు చేస్తున్నామని తెలిపారు. సంఘం నాయకులు కస్తూరి శ్రీనివాస్, నక్క వేణుమాధవ్, ఎస్.జి. తిలక్ పాల్గొన్నారు.

దేదీప్య జన్మదినం..

వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య తన జన్మదినం సందర్భంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దేదీప్యకు ఆయన కేక్ కట్ చేసి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.
– వెంగళరావునగర్, సెప్టెంబర్ 27

క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి విస్తృత అవకాశాలు

విజేతలతో డిప్యూటీ డీఈఓ శామ్యూల్‌రాజ్

జూబ్లీహిల్స్/ఎర్రగడ్డ, సెప్టెంబర్27 : చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు విస్తృత అవకాశాలుంటాయని జిల్లా ఉప విద్యాధికారి శామ్యూల్‌రాజ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జోనల్ స్థాయి ఇంటర్ స్కూల్ గేమ్స్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ విశ్వేశ్వరరావు, డిప్యూటీ ఐఓఎస్‌లు కొర్స యాదగిరి, పి.పరమేశ్వరమ్మ, శ్రావణ్‌కుమార్, హెచ్ఎం లు, పీఈటీలు పాల్గొన్నారు.

షెల్టర్లలో వీధికుక్కలపై హింసను నివారించాలి

ఖైరతాబాద్, సెప్టెంబర్ 27 : జీహెచ్ఎంసీ షెల్టర్లలో వీధి కుక్కలతో కొందరు అత్యంత అమానవీయంగా వ్యవహరిస్తున్నారని అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధి జయదీప్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎనిమల్ హోమ్స్ ప్రతినిధి రాజా వాసిరెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. వీధి కుక్కల నివారణకు రూ.18కోట్లు ఖర్చు చేశామని చెబుతున్న జీహెచ్ఎంసీ వాటి సంఖ్యను అదుపులోకి తీసుకురావడంలో విఫలమైందని ఆరోపించారు. దీనిపై విచారణ జరగాలని అన్నారు.

తిరుపతి లడ్డూకు నాణ్యమైన ఉత్పత్తులనే వాడాలి

ఖైరతాబాద్, సెప్టెంబర్ 27 : తిరుపతి లడ్డూ తయారీకి నాణ్యమైన ఉత్పత్తులను వినియోగించాలని యుగ తులసి ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివకుమార్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో తిరుపతి లడ్డూ తయారీలో ఘోర అపచారం జరిగిందని ప్రస్తుత ప్రభుత్వం ఆ అపచారాన్ని కొనసాగిస్తున్నట్లు కనిపిస్తుందన్నారు. లడ్డూ తయారీ కోసం ప్రైవేట్ పాలక కంపెనీకి చెందిన ఉత్పత్తులను వినియోగించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించడం విచారకరమన్నారు. తక్షణమే ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని తెలిపారు.

స్పెషల్ ఈవెంట్ ఎక్స్‌పో వస్త్ర ప్రదర్శన

వెంగళరావునగర్, సెప్టెంబర్ 27 : మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఈవెంట్ ఎక్స్‌పో సిల్క్, కాటన్ వస్త్రాల్లో వందశాతం నాణ్యతకు వేదికగా నిలుస్తుందని మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ వీవర్స్ సర్వీస్ సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో అక్టోబర్ 1 నుంచి 15 వరకూ అమీర్‌పేట కమ్మ సంఘంలో నిర్వహించనున్న ఈ ఎక్స్‌పో పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిష్ణాతులైన చేనేతకారుల ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించేందుకు ఎక్స్‌పోను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఎక్స్‌పోను రాష్ట్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని తెలిపారు. దేశంలో ప్రముఖ రాష్ట్రాలకు చెందిన నాణ్యమైన వస్త్రాలను అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు మేధాశక్తి పెంపొందించుకోవాలి

నేషనల్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో డాక్టర్ శ్రావణ్ కుమార్, ప్రిన్సిపాల్ సాయికుమార్

వెంగళరావునగర్, సెప్టెంబర్ 27 :విద్యార్థులు మేధాశక్తిని పెంపొందించుకోవాలని ఇండియన్ మెమరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఛాంపియన్ షిప్ ఇన్‌చార్జి డాక్టర్ పి.శ్రావణ్‌కుమార్ అన్నారు. హైదర్‌నగర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఇండియన్ నేషనల్ మెమరీ ఛాంపియన్ షిప్ 2024కు ఆయన ఎంపిక చేశారు. జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. సరైన ప్రోత్సాహం ఉంటే జాతీయ,ప్రపంచ ఛాంపియన్ షిప్‌కు పోటీ పడగలరని పేర్కొన్నారు. ఎంపికైన ఐదుగురు విద్యార్థులకు ఛాంపియన్ షిప్ రుసుము వైరల్ పే సేల్స్ అండ్ సర్వీస్ స్పాన్సర్ చేయడం జరిగిందన్నారు. హైదర్ నగర్ జడ్.పి.హెచ్.ఎస్ ప్రిన్సిపాల్ కె.సాయికుమార్ తదితరులు ఉన్నారు.

రహ్మత్‌నగర్ ట్రాఫిక్ జంక్షన్ ఏర్పాటుచేయాలి

జూబ్లీహిల్స్,సెప్టెంబర్27 : రోజురోజుకూ పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకుని రహ్మత్‌నగర్ కూడలిలో ట్రాఫిక్ జంక్షన్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం జీహెచ్ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస రావును కలిసి రిప్రజెంటేషన్ అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ సమస్యలు దృష్టిలో పెట్టుకుని రోడ్డు వెడల్పు పనులు త్వరగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఇక్కడ పర్యటించి జంక్షన్ అభివృద్ధిపై పరిశీలన చేసినట్లు తెలిపారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన సీసీపి త్వరలో ఇక్కడ పర్యటించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారని తెలిపారు.

ఆకట్టుకున్న విద్యార్థినుల 'రంగ్‌లీలా రాస్'

దాండియా ఆటలు...సంప్రదాయ నృత్యాలతో విద్యార్థినులు ఆకట్టుకున్నారు. సోమాజిగూడలోని విల్లా మేరీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'రంగ్‌లీలా రాస్' పేరుతో మినీ నవరాత్రోత్సవాలను నిర్వహించారు. కళాశాలలోని కామర్స్ విభాగంలో ఏర్పాటు చేసిన ఉత్సవాలను వ్యవస్థాపకురాలు డాక్టర్ ఫిలోమినా, కళాశాల కార్యదర్శి చిన్నమ్మ, ప్రిన్సిపాల్ రేవతి దేవి మాథూర్, కరస్పాండెంట్ శ్రీనివాస్ రావుతో కలిసి ప్రారంభించారు.
– ఖైరతాబాద్, సెప్టెంబర్ 27

బొలేరో డ్రైవర్‌పై కేసు నమోదు

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 27: రోడ్డు మధ్యలో బొలేరో వాహనం నిలిపి ట్రాఫిక్ అంతరాయం కల్గించడంతో పాటు విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ పట్ల దురుసుగా ప్రవర్తించిన బొలేరో వాహన డ్రైవర్‌పై శుక్రవారం నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండ ప్రాంతానికి చెందిన సర్వర్(25) బొలేరో వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. హిమాయత్‌నగర్ మినర్వా హోటల్ వద్ద రోడ్డు మధ్యలో నిలుపడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. బ్లూ కోర్టు కానిస్టేబుల్ నర్సింహాచారి, హోంగార్డు శ్రీనివాస్ సమాచారం అందుకుని ఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని పక్కకు తీయాలని సూచించగా తననే పక్కకు తీయమంటావా అంటూ సర్వర్ వారి పట్ల దురుసుగా వ్యవహరించాడు. తమ విధులకు ఆటంకం కల్గించడంతో పాటు దురుసుగా ప్రవర్తించిన సర్వర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కానిస్టేబుల్ నర్సింహాచారి పీస్‌లో ఫిర్యాదు చేశాడు. సర్వర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

హైడ్రా..దౌర్జన్యం చేయొద్దు

హిమాయత్‌నగర్, సెప్టెంబర్27: హైడ్రా పేరుతో పేద ప్రజలను ఇబ్బందులు పెట్టే పనులను మానుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.ఎస్. బోస్ ప్రభుత్వాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఎన్నో ఏండ్లుగా ఉన్న పేదల ఇండ్లను కూల్చవద్దన్నారు. చెరువులు, నాలాల ప్రాంతాల్లో అక్రమ కట్టడాలను నిర్మించటానికి ప్రభుత్వ అధికారులే ప్రధాన పాత్ర పోషించారని, బ్యాంకు అధికారులు రుణాలు మంజూరు చేసేందుకు అన్ని పత్రాలను పరిశీలించిన తరువాతనే రుణాలను ఇస్తారని తెలిపారు. హైడ్రాతో తాము ఇచ్చిన రుణాలు తిరిగి పొందేందుకు ఆటకం కల్గుతుందని ఆర్‌బీఐకి బ్యాంకు అధికారులు ఫిర్యాదు చేయడ మంటే వారు తప్పించు కునే కుట్రలో భాగమేనన్నారు. ఈ విషయంలో తప్పుడు స్థలాలకు రుణాలు మంజూరు చేసిన అధికారులను కఠినంగా శిక్షించాలన్నారు. ఎఫ్‌టీఎల్‌లో భవనాలు నిర్మించిన వారితో పాటు అన్ని అనుమతులు ఇచ్చిన జీహెచ్ఎంసీ అధి కారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. వేతన జీవులు, పేదవారు, అమాయక ప్రజలకు నష్టం జరుగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలని లేని పక్షంలో ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హిందూ శ్మశాన వాటికలో సమస్యలు పరిష్కరించాలి

జూబ్లీహిల్స్,సెప్టెంబర్27 : ఫిలింనగర్– హకీంపేట్ దగ్గరలో ఉన్న హిందూ శ్మశాన వాటికలో సమస్యలు పరిష్కరించాలని జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం జూబ్లీహిల్స్ 18 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వి.ప్రశాంతిని కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హిందూ శ్మశాన వాటికలో పిచ్చి మొక్కలు పెరిగి నడవడానికి వీలు లేకుండా ఉందన్నారు. ఇందుకు డీసి సానుకూలంగా స్పందించి వెంటనే పరిశుభ్రత పనులు చేపడతామన్నారని తెలిపారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

మైలార్‌దేవ్‌పల్లిలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

మున్సిపల్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్ పర్సన్ కస్తూరి నరేందర్

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 27: అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం జీవితకాలం కృషి చేసిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ అని రంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి ఏర్వ సత్యనారాయణ, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కాశీగారి యాదగిరి అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ భవనా బుషి కాలనీ శ్రీ మార్కండేయ పద్మశాలి ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉస్కెమూరి విజయ్‌కుమార్, పగిడిమర్రి సూర్యనారాయణ, కొంపల్లి జగదీష్, దొంత రాజు, మునగపాటి వెంకటేశ్వర్లు, ఏర్వ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ : సర్కిల్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్ పాల్గొని బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్ తదితరులు

మణికొండ : కొండా లక్ష్మణ్ సేవలను ప్రజలు ఎన్నటికీ మరచిపోరని మణికొండ మున్సిపాలిటీ చైర్ పర్సన్ కస్తూరి నరేందర్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ ప్రదీప్‌కుమార్, డీఈ దివ్యజ్యోతి పాల్గొన్నారు.

వ్యవసాయ యూనివర్సిటీ : దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి కొండాలక్ష్మణ్ బాపూజీ అని కొండాలక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర ఉద్యాన వప విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ కళాశాల అసోషియేట్ డీన్ ప్రశాంత్ అన్నారు. శుక్రవారం శ్రీ కొండాలక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. తన జీవిత కాలం ప్రత్యేక రాష్ట్రంకోసం పోరాడారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షతో 1969లో తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి మలివిడత తెలంగాణ ఉద్యమంలో ఎంతో కీలకంగా పనిచేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఉద్యాన విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టడం గర్వించ దగ్గ విషయమన్నారు. డీన్ ఆఫ్ స్టూడెంట్స్ డా. విజయ, డా. కళాధర్ బాబు, డా. షహనాజ్, నిరోష, అశ్వినీ కుమార్, సంతోషిని, శ్రీనివాసుల, శ్రీరాములు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

అదేవిధంగా వ్యవసాయ విశ్వవిద్యాలయలంలో కొండాలక్ష్మణ్ జయంతి సందర్భంగా ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవన్‌లో రిజిస్ట్రార్ డా. రఘు రామిరెడ్డి ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న అసోషియేట్ డీన్ ప్రశాంత్ తదితరులు

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి –ఖైరతాబాద్